# పూలలో మధువు

మేము ఆ ఇంట్లో చేరిన రెండో రోజే తెలిసిపోయింది. మా పక్కింటాయన సంగతి. మహాపిసినారి. పైసా ఖర్చు పెట్టడు. కడుపునిండా తిండి తింటాడో లేదో! ఉన్నది ఒకడే. ఏం వండుకొంటాడోగాని ఒక్క రోజునా వాళ్ళింట్లో తిరుగమోత చుయ్‌మనగా ఎవరూ వినలేదంటారు. వీళ్ళవల్లా వాళ్ళవల్లా కూడా మాకెన్నో కథలు తెలిశాయి. వాళ్ళింటికి పనివాళ్ళెవ్వరూ వెళ్ళరు. అన్ని పనులూ ఆయనే స్వయంగా చేసుకొంటాడు. పెద్ద ఇల్లు. కాని తను ఒక గది మాత్రం వాడుకొంటాడు. తక్కినవన్నీ కాలేజి స్టూడెంట్లకి అద్దెకిచ్చాడు. అద్దె వసూలు చేయటంలో చాలా నిఖార్సయిన మనిషట. రాత్రి పదిగంటలు దాటితే ఎవరినీ లైటు వేసుకోనివ్వడు, కరెంటు ఖర్చని. కాలేజి పిల్లలు కూడా అతనిని రకరకాలుగా ఏడిపిస్తుండేవారు.

వాళ్ళింట్లో పెద్ద కరివేపాకు చెట్టుండేది. మా సుమతి ఒకసారి బాబీని పంపింది, "రెండు రెమ్మలు ఆ తాతగారిని అడిగి పట్టుకురారా" అని. వాడు బిక్క మొహం వేసుకుని వాపసు వచ్చాడు.

"కరివేపాకు ఏదిరా?" అని అడిగింది వాళ్ళమ్మ.

"ఆ తాతగారు డబ్బులడుగుతున్నారు."

"ఏమిట్రా?" అంది సుమతి అర్థంగాక.

"ఇరవై పైసలు పట్టుకురమ్మన్నారు".

సుమతి తిరిగి వాడిని పంపలేదు.

కొన్నాళ్ళకు దీపావళి పండుగ వచ్చింది. రకరకాల వంటకాలన్నీ మావాడి చేతికిచ్చి పక్కింటికి పంపింది సుమతి.

"ఇక్కడ తినే వాళ్ళెవరూ లేరు పట్టుకుపో నాయనా. ఇంకెప్పుడూ తీసుకురాకు" అని వెనక్కి పంపేశాడు పక్కింటాయన. అప్పటినుండి పక్కింటితో మాకు ఏ సంబంధాలూ లేవు.

ఒకనాడు పక్కింట్లోనుండి పెద్ద పెద్దగా కేకలు వినిపించాయి. వీధి వీధంతా పోగైంది. అంత గుంపూ చూసి రాక్షసుడిలా అరిచాడు. "మీకు వేరే పనులేవీ లేవా? ఇక్కడేం కోతులాడుతున్నాయా అంత చోద్యంగా చూస్తున్నారు? వెళ్ళండిక్కడినుండి." అందరూ మెల్లమెల్లగా జారుకొన్నారు.

ఆ గుంపులోనుండి కదిలివచ్చిన రెడ్డెమ్మ "బట్టలు వెయ్యండమ్మా" అని పిలిచింది సుమతిని.

సుమతి హాల్లో రెడ్డెమ్మకు బట్టలు వేస్తూ మాట్లాడే మాటలు నాకు వినిపిస్తున్నాయి.

"ఏమిటా గొడవ పక్కింట్లో?"

"ఆ నారాయణప్ప సంగతి అడిగేదేముంది? మామూలే"

"అంటే..."

"ఎప్పుడూ అద్దెకుంటున్న కుర్రాళ్ళతో గొడవపడుతూనే ఉంటాడు. వీళ్ళూ అంతే. ఒకబ్బాయి లైటుకు తువ్వాలు చుట్టి తలుపేసుకు వెళ్ళిపోయాడట. ఏదో కాలిన వాసన వాస్తే ఈయన కిటికీలోనుండి చూశాడు. తాళం బద్దలుకొట్టి లోపలికి వెళ్ళాల్సి వచ్చింది. దాంతో, అరుపులూ, గొడవలూను."

"తప్పేకదూ? అయినా ఆ స్టూడెంట్ అలా ఎందుకు చేశాడు?"

"కుర్రాళ్ళు. వాళ్ళదేంబోయె. ఏదో ఈ యప్పను ఏడిపించాలని..."

ఆ రాత్రి మా ఫ్రెండ్ సుందరం వచ్చినప్పుడు ఈ మాటా, ఆ మాటా మాట్లాడుతుంటే నారాయణప్ప ప్రసక్తి వచ్చింది.

"అబ్బా ఏం మనిషండి! ఎప్పుడూ నలిగిన చొక్కా, అడ్డపంచె. గాలిమేసి బతుకుతాడో, నీళ్ళు తాగి ఉంటాడోగాని ఉఫ్‌మంటే ఎగిరిపోయేలా ఉంటాడు. వెనకా ముందూ ఎవరూ

లేరు. కావలసినంత ఆస్తి ఉంది. కడుపునిండా తిని, నచ్చిన బట్ట కట్టుకొని సుఖపడరాదూ. ఎప్పుడూ పీనాసితనమే. పైసా, పైసా కూడబెట్తాడు. డబ్బు వడ్డీలకు తిప్పుతాడు. ఎందుకండి ఈ తాపత్రయం. పొయ్యేప్పుడు వెంట బెట్టుకుపోతాడా?" అన్నాడు సుందరం.

సుందరం ఆ ఊరివాడే కాబట్టి నారాయణప్ప సంగతులన్నీ తెలుసు.

"ఇతనికి ఎవ్వరూ లేరంటారా?" అని అడిగాను.

"బంధువులున్నారు. కానీ ఎవరినీ దగ్గరకు రానివ్వడు. తన సంపద అంతా ఎత్తుకు పోతారని భయం. తనకు పిల్లలు లేరు. మొన్న మొన్నటి దాకా భార్య ఉండేది. ఆమెను నేనూ చూశాను. డొక్కులా ఉండేది. ఎవరితో కలిసేది కాదు. మాట్లాడేది కాదు. తనూ, తన ఇల్లూ. చాలా పొదుపుగా సంసారం చేసేది అంటారు కొందరు. మొగుడు పైసా రాలిస్తే గదా అంటారు మరికొందరు.

వాళ్ళింటి ముందున్న పూలమొక్కలు పెంచుకొంటూ, కూరపాదులు సరిచేస్తూ కాలంగడిపేది. ఆమె కూడా జబ్బుతో తీసుకుని, తీసుకుని పోయింది. దానికీ అందరూ నారాయణప్పనే అంటారు. సరిగా వైద్యం చేయించలేదనీ, తిండీ, తీర్థం చూడలేదని."

"అవునూ, ఈ నారాయణప్ప ఏం చేసేవాడు?"

"ఏదో కొద్దిగా చదువుకున్నాడుగాని ఉద్యోగాలేమీ చెయ్యలేదు. ఒకప్పుడు వ్యవసాయం ఉండేదట. తన పెత్తనం రాగానే ఆ భూములన్నీ అమ్ముకుని డబ్బు బ్యాంకుల్లో వేసుకున్నాడు. మిగిలింది వడ్డీలకు తిప్పుతాడు. ఇల్లంతా అద్దెలకిచ్చేశాడు. అక్కడా ఆదాయం బాగానే ఉంది."

"కొందరి జీవితమంటే. డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకొంటారు. డబ్బుకూ ఒక ప్రయోజనముందనీ, అది లేనినాడు డబ్బు వ్యర్థమనీ గుర్తించరు."

మేము మరో రెండేళ్ళు ఆ ఊళ్ళో ఉన్నా నారాయణప్ప జీవితంలో ఏ మార్పూ గమనించలేదు. తప్పితే మరికొంత వయసు మీద పడినట్లు కనిపించేవాడు.

నాకు మరో ఊరు బదిలీ అయింది. ఒక ఏడాది గడిచి ఉంటుంది. ఒకసారి అనుకోకుండా హెడ్డాఫీసులో సుందరం కలిశాడు. హోటల్లో కాఫీ అదీ తాగాము. వెళ్ళబోయే ముందు అడిగాను. "నారాయణప్ప ఎలా ఉన్నాడు?"

సుందరం మామూలుగా ఛీత్కారం చేసి "అతని సంగతి చెప్పేదేముంది?" అంటాడనుకొన్నా.

కాని సుందరం ముఖం గంభీరంగా మారిపోయింది. కాస్త ఆగిసిగరెట్టు వెలిగించుకున్నాడు. నెమ్మదిగా "నారాయణప్ప పోయాడు" అన్నాడు.

"అరె ఎప్పుడూ?"

"ఐదారు నెలలై ఉంటుంది."

"పాప!ం"

"ఇంకో సంగతి తెలుసా? మునిసిపాలిటీ వాళ్ళు లాగేసేపని. కాని ఊరివాళ్ళే నలుగురు కలిసి దహనం చేశారు. ఆ తర్వాత వాళ్ళ అక్క కొడుకునంటూ ఒకతను దిగాడు. ఆస్తి అంతా అతనికే చెందుతుందని అందరూ అనుకున్నారు."

"దానిలో కష్టమేముంది?" అని అడిగాను.

సుందరం మాట్లాడలేదు. సిగరెట్టు పొగనిండుగా పీల్చాడేమో దగ్గుతున్నాడు. పాడు సిగరెట్లూ, వాడూను. మానెయ్యమని ఎప్పటినుండో చెబుతున్నా వింటేకదా. కాస్సేపటికి దగ్గు సర్దుకుంది.

"నారాయణప్ప మేనల్లుడు వచ్చాడు వారసుణ్ణి అంటూ. కానీ అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం నారాయణప్ప విల్లు."

"ఏం రాశాడేమిటి? తన ఇంట్లోనే డబ్బూ, దస్కం వేసి తనను దహనం చేయమన్నాడా?"

"అతన్ని తెలిసిన వాళ్ళెవరైనా అలాగే అనుకొంటారు. కాని అతని విల్లు వివరాలు తెలిశాక అందరూ నోళ్ళెళ్ల బెట్టారు. తన లంకంత ఇల్లు బీద విద్యార్థులకు వసతి గృహంగా మార్చమని కాలేజీకి రాసిచ్చాడు. తన ఆస్తి అంతా వివరంగా లెక్కలు రాసి పెట్టాడు. ఇరవై లక్షలదాకా తేలింది. ఆ ఊళ్ళో దిక్కులేని ముసలాళ్ళకు ఒక ఆశ్రమం కట్టమనీ. ఒక ట్రస్టు ఏర్పాటు చేయమనీ కోరాడు. రిటైర్డు మాష్టారు రంగారావుగారు అన్నిటికీ బాధ్యత వహించాలని కూడా రాశాడు. అతను ఆలోచించని వివరమంటూ లేదనుకో. ఇప్పుడు నారాయణప్ప గురించి ఊరు ఊరంతా కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఆయన 'ధర్మాత్ముడు' అంటే 'మహాధర్మాత్ముడు' అంటున్నారు."

నేనేం మాట్లాడలేదు. అసలు మాటలు రాలేదు. బుర్రలో మాత్రం రవీంద్రుని గీతం గింగురుమంటోంది. పూలలో మధువు, పండ్లలో రసం ఎందుకు ఉంటాయో నాకు బాగా అర్థమయింది.

*(17 జూన్ 1990)*